సాక్షి
నిర్మల్
ఆదివారం, 21, మే, 2023



కేంద్రమంత్రికి వినతి

భైంసాటౌన్: బీజేపీ భైంసా పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు కారిగిరి భూషణ్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని శనివారం కలిశారు. బాసర సరస్వతి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.



'ఐబీ'లో హరితహోటల్ 8లో▸

జిల్లా కేంద్రంలో మరో కొత్త నిర్మాణం జరుగనుంది. పర్యాటక అభివృద్ధి దిశగా హరితహోటల్ నిర్మాణం కానుంది. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం స్థానలో హోటల్ నిర్మించనున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.8 /28.6

ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. సాయంత్రం అక్కడక్కడ చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చేపల మార్కెట్ సందర్శన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో రూ.65 లక్షలతో నిర్మించిన నూతన చేపల మార్కెట్ భవనాన్ని గంగపుత్ర సంఘాల ప్రతినిధులతో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం సందర్శించారు. చేప్పజీ విక్రయించే వారికి అనుగుణంగా ప్లాట్ ఫామ్స్ సిద్ధం చేశామని తెలిపారు. కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. చేపల డ్రెస్సింగ్ కోసం ప్రత్యేక షెడ్లు వేశామని తెలిపారు. త్వరలో ప్రస్తుతం ఉన్న చేపల మార్కెట్‌ను నూతన భవనంలోకి మారుస్తామని పేర్కొన్నారు. చైర్మన్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, టీపీవో సుమలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్ తదితరులు ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌ఎంవో


నిర్మల్‌చైన్‌గేట్: ట్రైనింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంవో వేణుగోపాలకృష్ణ పోలీస్ సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సిబ్బందికి ఆరోగ్య సూత్రాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, డాక్టర్ రత్నాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, హెడ్‌నర్సు శోభ, ఐసీయూ సిబ్బంది యోగేశ్, డయాలసిస్ సిబ్బంది సాయి, ప్రవీణ్, రాకేశ్, ఔట్‌పోస్ట్ తిరుపతి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న సీఐ ఎల్.శ్రీను

భైంసాటౌన్: భైంసాలోని ఏరియాస్పత్రిలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. పట్టణ సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులు సుమల, పద్మావతి, సురేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేవా ప్రతిభ పురస్కారాల ప్రదానం


పురస్కారం అందిస్తున్న కేవా సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థి తోడిశెట్టి రిషిత్‌కు కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం(కేవా) ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ప్రతిభ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేవా జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి రవీందర్ మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కుమ్మర సామాజికవర్గానికి చెందిన విద్యార్థులకు ఏడేళ్లుగా పురస్కారాలతోపాటు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర కులసంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్ , ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జుట్టు గజేందర్, నాంపల్లి నాగభూషణ్, కేవా ప్రధాన కార్యదర్శి పోతుగంటి సాయన్న, కోశాధికారులు తోడిశెట్టి శంకర్, చిలివేరి అశోక్ కుమార్, పోతుగంటి లక్ష్మణ్, నాయకులు రవికాంత్, పరమేశ్వర్, చంద్రయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, సత్యనారాయణ, శ్యాంసుందర్, శ్రీకాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు

నిర్మల్‌టౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ డీ ఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 55 వాహనా లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎ స్పీ మాట్లాడుతూ.. పట్టణంలో కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు, నంబర్ ప్లేట్ పెట్టుకోవ డం లేదన్నారు. నంబర్ ప్లేట్ విరగొట్టినా.. తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 14 మందికి జరిమానా విధించకుండా రూ.500 తో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


శాస్త్రీనగర్‌లో చెట్టు నీడన గోలీలు ఆడుతున్న చిన్నారులు


బోయవాడలో ఇంటి పట్టున ఆన్‌లైన్ గేమ్స్..


సెల్ ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడుతున్న చిన్నారులు


ఇంద్రనగర్‌లో సాయంత్రం క్రికెట్ ఆడుతూ..

నీడపట్టున ఆటలు

జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచే నిప్పులు కురిపిస్తున్నాడు. దీంతో జనం బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. వేసవి సెలవుల్లో ఉన్న పిల్ల లు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నీడపట్టున ఆడుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చెట్ల నీడన ఆటలాడుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో ఇళ్లలోనే ఇలా సెల్‌ఫోన్‌లో వీడియో గేమ్స్ ఆడుతూ.. టీవీలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్



రాజకీయవేడి!

- నిర్మల్‌లో 'అల్లోల'-'ఏలేటి' సోషల్‌వార్
- ఖానాపూర్‌లో లోకల్-నాన్‌లోకల్ లొల్లి
- ముథోల్‌లో 'పటేళ్ల' మధ్య పోటాపోటీ
- హీటెక్కుతున్న జిల్లా పాలిటిక్స్

నిర్మల్: నడి ఎండాకాలం.. జిల్లా 43-45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలతో మండిపోతోంది. మరోవైపు ఎండలకు దీటుగా రాజకీయవేడి పెరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఏ చిన్నవిషయాన్నీ వదలకుండా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పాలి'ట్రిక్స్' ప్లే చేస్తున్నారు. ప్రత్యర్థులతోపాటు సొంతపార్టీలో పోటీదారులతోనూ పోటీపడుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో మంత్రి అల్లోల వర్సెస్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మధ్య 'సోషల్ వార్ ముదురుతోంది. ఖానాపూర్‌లో లోకల్-నాన్‌లోకల్ నినాదం బీఆర్‌ఎస్ నేతలను టెన్షన్ పెడుతోంది. ఇక ముథోల్ నియోజకవర్గంలో ప్రత్యర్థులతో పోటీ పడుతూనే సొంత పార్టీలో పటేల్ సోదరులు పోటాపోటీగా ప్రజల్లోకి వెళ్తున్నారు.

నిర్మల్‌లో 'సోషల్‌వార్'..



'ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మళ్లీ సొంతగూటికి చేరుతున్నారు. కర్ణాటక ఫలితాలతో కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నారు..' అంటూ బీఆర్‌ఎస్ సోషల్‌మీడియాలో మెసేజ్‌లు, న్యూస్‌లు పెట్టగా, 'బీఆర్‌ఎస్ నిర్మల్ టికెట్ శ్రీహరిరావుకే.. ఇక కాంగ్రెస్‌లో చేరనున్న మంత్రి అల్లోల..' అంటూ బీజేపీ కౌంటర్ పోస్టులు వదిలింది. ఇలా ఒకరిపై ఒకరు పార్టీలు మారుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా బురదజల్లుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపులలో నిత్యం రెండు పార్టీల మధ్య పోటాపోటీగా పోస్టుల యుద్ధం కొనసాగుతోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత ఈ తీరు మరింత ముదిరింది. ఇక చాలామంది అనుచరులు, కార్యకర్తలు ఆయా న్యూస్ వీడియోలు, మెస్సేజ్‌లను తాము ఉన్న గ్రూపులలో ఫార్వర్డ్ చేస్తున్నారు. వాస్తవానికి రెండు పార్టీలూ పెడుతున్న వాటిలో ఫేక్ వీడియోలు, మెసేజ్‌లే ఎక్కువగా ఉంటున్నాయని ఆయా పార్టీల సీనియర్ నాయకులే చెబుతున్నారు.

ఖానాపూర్‌లో 'లోకల్ లొల్లి'..

ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో గతంలో ఎన్నడూ లేని కొత్త నినాదం జోరందుకుంటోంది. 'లోకల్-నాన్‌లోకల్' అంటూ పలువురు నాయకులు ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రధానంగా అధికార బీఆర్‌ఎస్‌లో టికెట్ కోసం పోటీపడుతున్న అభ్యర్థుల మధ్య ఈ నినాదం టెన్షన్ పెంచుతోంది. ఈసారి ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్‌తోపాటు కొత్తగా అదే పార్టీ నుంచి హైదరాబాద్ మాజీ కలెక్టర్ శర్మన్ చౌహాన్, ఎంపీ సంతోష్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ కన్వీనర్ పూర్ణచందర్ నాయక్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్‌రాథోడ్ లతోపాటు మంత్రి కేటీఆర్‌కు మిత్రుడైన జాన్సన్ నాయక్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. పోటీ తీవ్రమైన నేపథ్యంలో 'లోకల్-నాన్‌లోకల్' నినాదం తెరపైకి వచ్చింది. ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్‌తోపాటు జాన్సన్‌నాయక్ పక్కనున్న జగిత్యాల జిల్లాకు చెందినవారని, వారికి టికెట్ ఇవ్వొద్దంటూ స్థానిక నేతలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దీనికి పోటీగా అధిష్టానం అండ ఉన్నవారికే టికెట్ వస్తుందన్న ప్రచారాన్ని చేస్తున్నారు. మరోవైపు లోకల్-నాన్‌లోకల్ అంశంపై 'ఖానాపూర్' సోషల్ మీడియా లోనూ లొల్లి కొనసాగుతోంది.

ముథోల్‌లో పటేళ్ల మధ్య పోటీ..

రాష్ట్ర సరిహద్దున గల ముథోల్ నియోజకవర్గంలో ఇప్పటికే ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. అధికారిక, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నిత్యం గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటున్నారు. మరోవైపు బీజేపీ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులూ నియోజకవరగంలో పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. 'ఇంటింటికీ బీజేపీ-గడపగడపకూ మోహన్‌రావు' పేరుతో ఇప్పటికే మోహన్‌రావుపటేల్ గ్రామగ్రామానికి వెళ్తుండగా, వివిధ కార్యక్రమాల పేరుతో రామారావుపటేల్ పల్లెబాట పడుతున్నారు. ఇక్కడి నుంచి రెండుసార్లు పోటీచేసిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి సైతం పార్టీ కార్యక్రమాల పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా బీజేపీ టికెట్ కోసం పటేల్ సోదరుల మధ్య పోటీ వాతావరణం కనిపిస్తోంది.

ధర కోసం పడిగాపులు!


భైంసా మార్కెట్‌యార్డులో ధర కోసం వేచిచూస్తున్న రైతులు

- భైంసా వ్యవసాయ మార్కెట్‌లో రైతుల తిప్పలు
- భారీగా అమ్మకానికి వచ్చిన మక్కలు, నువ్వులు
- ఈనామ్‌లో జాప్యంతో అన్నదాతకు తప్పని నిరీక్షణ


మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మక్కలు

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్‌కు తెచ్చిన పంట ఉత్పత్తులకు ఈనామ్‌లో సకాలంలో ధర నిర్ణయించకపోవడంతో గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఎండలు మండుతుండడంతో రైతులు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. కాటన్‌యార్డులో రైతుల కోసం విశ్రాంతిభవనం ఉన్నా.. దానిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో గాంధీగంజ్ లోని మార్కెట్‌యార్డు ఆవరణలోనే ఎండలో పడిగాపులు కాస్తున్నారు. ఒక్కోసారి బిడ్ సమయం మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు ఇస్తుండడంతో, పంట ఉత్పత్తులు కాంటా చేసి విక్రయించాలంటే రాత్రి వరకు రైతులు వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్ యార్డుల్లో రైతులకు భోజన వసతి లేకపోవడంతో ఉదయం మార్కెట్‌కు పంట ఉత్పత్తులు తెచ్చింది మొదలు విక్రయించే వరకు పస్తులు ఉండాల్సి వస్తోంది.

మార్కెట్‌కు భారీగా మక్కలు...

ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, రైతులు చాలామంది ప్రైవేట్‌లోనే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేస్తామని నిబంధన విధించడంతో, మిగిలిన మక్కలను ప్రైవేట్‌లో విక్రయిస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియలో ఆలస్యం కారణంగా, వర్షం భయంతో రైతులు చాలామంది భైంసాలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎక్కువ మొత్తంలో మక్కలు తెచ్చి విక్రయిస్తున్నారు. శుక్రవారం అమావాస్య ఉండడంతో మార్కెట్‌యార్డుకు సెలవు నేపథ్యంలో శనివారం భారీగా రైతులు పంట ఉత్పత్తులను తీసుకొచ్చారు. ఈ ఒక్కరోజే మార్కెట్‌కు 437 లాట్‌లు వచ్చాయి. దీంతో లాట్ నంబర్ ఇవ్వడంతోపాటు ధర నిర్ణయించడంలో జాప్యం జరిగింది. దీనికితోడు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతం కావడంతో రైతులు ఆందోళన చెందారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఉదయం నుంచి వేచి ఉన్నాం..



వ్యవసాయ మార్కెట్‌కు నువ్వులు, జొన్నలు తీసుకువచ్చిన. ఉదయం 10 గంటలకు లాట్ నంబర్ ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ధర నిర్ణయించలేదు. చేసేది లేక ఇక్కడే నిరీక్షిస్తున్నాం. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు జరిగేలా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోవాలి.
– రవి, రైతు, ఎగ్గాం

సర్వర్‌లో సమస్యతోనే..

రైతులకు ముందుగానే లాట్ నంబర్లు కేటాయించి, వ్యాపారులు ఈనామ్‌లో నమోదు చేస్తారు. సర్వర్‌లో సమస్య కారణంగా ధర నిర్ణయించడంలో జాప్యం కలుగుతోంది. సకాలంలో కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటాం.
– అడెల్లు, ఉన్నతశ్రేణి కార్యదర్శి, ఏఎంసీ, భైంసా

పాడి రైతులను ప్రోత్సహించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పాడి పెంపకాన్ని, పాడి రైతులను ఏపీఎంలు ప్రోత్సహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, స్త్రీనిధి డీజీఎం వేణుగోపాల్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మీతో కలిసి సమీక్షించారు. జిల్లాలో పాడి పరిశ్రమ, పెరటి కోళ్లు, చేపల పెంపకం వ్యూహాత్మకంగా చేపట్టాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, తృణ ధాన్యాలు సాగుచేసేలా చర్య తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక పథకాలతో 500 పాడిపరిశ్రమ యూనిట్లు, 30 గొర్రెల యూనిట్లు, 600 పెరటి పౌల్ట్రీ యూనిట్లు, విద్యుత్ ఆటోలు 30 యూనిట్లు, కూరగాయల సాగు 20 యూనిట్లు, ఎలక్ట్రిక్ టూ వీలర్లు 45 యూనిట్లు, జనరిక్ మెడికల్ స్టోర్లు 3 యూనిట్లు, హౌసింగ్ రిపేర్లు 30 యూనిట్లు, సోలార్ పవర్ యూనిట్లు 2 కిలోవాట్‌లు, 3 కిలోవోట్‌లు 350 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి రుణాల పంపిణీ సంతృప్తికరంగా ఉందన్నారు. గొర్రెల పెంపకం లాంటివి విరివిగా చేపట్టాలన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో లవణ మిశ్రమ కేంద్రం, పాల ప్యాకింగ్ కేంద్రం, దూడల పెంపకం చేపడతామని తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నర్సింహారెడ్డి, విజయ డెయిరీ ఆర్‌ఎం సరిత, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఏపీఎంలు, స్త్రీనిధి జోనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

కుంటాల: చదువుతోనే జీవన విధానంలో మార్పు వస్తుందని, సమాజం మారుతుందని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో పరివర్తన్ పరివార్ సహకారంతో ఎన్‌జీవోఎస్ స్ఫూర్తి కొలిపాక, వినయ్ వంగళ, నాగార్జున, మైథిలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. చదువులకు పేదరికం అడ్డు రాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యనందించడంతోపాటు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. స్మార్ట్‌ఫోన్లతో చదువులకు దూరం అవుతున్నారని, తల్లిదండ్రులు టీవీలకు, స్మార్ట్‌ఫోన్‌లకు విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి పెరిగి వారి సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. లైబ్రరీని 400 పుస్తకాలతో ఏర్పాటు చేసిన పరివర్తన్ పరివార్ సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భోజా బాయి, ఎంఈవో ముత్యం, వైస్ ఎంపీపీ మౌనిక, ఉప సర్పంచ్ కిష్టయ్య, భైంసా రూరల్ ఎస్సై శ్రీకాంత్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, హెచ్‌ఎం ఎల్లన్న, దిగంబర్ పటేల్, చంద్రకాంత్, ప్రసాద్, మధు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే విక్రయాలు జరపాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్ టౌన్: విత్తన షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకే విక్రయాలు జరపాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి నాగరాజుతో కలిసి నిర్మల్‌లోని పలు షాపులను తనిఖీ చేశారు. విత్తన గోదాములను తనిఖీ చేసి నకిలీ విత్తనాల ఉన్నాయా అని పరిశీలించారు. రైతులకు ఇచ్చే రశీదులపై పంట వివరాలు, లాట్ నంబర్ తప్పకుండా రాయాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు గడువు ముగిసిన విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండి నకిలీ విత్తనాలు అమ్మే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని సూచించారు. వారివెంట పట్టణ సీఐ మల్లేశ్, ఎస్సైలు మహేశ్, ఆరిఫ్, మహమ్మద్ ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

దిలావర్‌పూర్: గ్రామీణ ప్రాంతాల్లో స్వయంసహాయ సంఘాల మహిళలు తాము తీసుకుంటున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని స్త్రీనిధి రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి అన్నారు. దిలావర్‌పూర్‌లోని మండల సమాఖ్యను శనివారం పరిశీలించారు. సమాఖ్య పరిధిలోని వివిధ క్లస్టర్లలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి పొందుతున్న వారిని క్షేత్రస్థాయిలో పండ్లతోటల సాగు, నూనె తీసే యంత్రం, అలాగే కుటీర పరిశ్రమలను ఆయన పరిశీలించారు. తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. ఆయన వెంట డీజీఎం వెంకట్‌రెడ్డి, జెడ్‌ఎం అనంతకిశోర్, ఆర్‌ఎం.సరిత, ఏపీఎం సులోచన, మేనేజర్లు కపిల్, సురేశ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఫాతిమా, సీసీలు పోశెట్టి, ముత్యం, సాయన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా బుద్ధజయంతి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని సోఫినగర్‌లో నిర్మల్ బుద్ధవిహార్‌లో బుద్ధ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. బుద్ధ విహార్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కుంటోళ్ల వెంకటస్వామి, మధుకర్ మునేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మల్లేశ్‌కు దాతల సాయం



మల్లేశ్‌ను పరామర్శిస్తున్న చారులత

సాక్షి స్పందన

కడెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అచేతన స్థితిలో మంచానికే పరిమితమైన మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేష్ దీన గాథను.. ఈనెల 20న, 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శనివారం కొందరు వ్యక్తులు మల్లేశ్ ఫోన్ పేలో రూ.10 వరకు పంపించారు. కాంగ్రెస్ నాయకురాలు రాథోడ్ చారులత మల్లేశ్‌ను పరామర్శించి రూ.వెయ్యి రూపాయలు అందజేశారు.

రోజంతా దీక్ష, రాత్రంతా బస



బతుకమ్మ ఆడుతున్న వీవోఏలు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన సమ్మె మండలంలో ఉధృతంగా సాగుతోంది. శనివారం పట్టణంలో ర్యాలీలు, మానవహారాలతో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోజంతా నిరవధిక దీక్ష చేపట్టారు. అనంతరం రాత్రికి అక్కడే రాత్రంత బస చేశారు. ఈ సందర్భంగా రాత్రిపూట బతుకమ్మ ఆటలతో వినూత్న నిరసన తెలిపారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న బీఆర్‌ఎస్

ఉట్నూర్‌రూరల్: ఉపాధి హామీ పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ ఆరోపించారు. మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగడానికి నీరు, మెడికల్ కిట్లు, పనుల వద్దకు వెళ్లడానికి వాహన సౌకర్యం లేకుండా ప్రభుత్వం నామమాత్రంగా పనులు కల్పించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ నిధులను శ్మశాన వాటిక, పార్కు, రైతు వేదికలకు మళ్లించడమే ఇందుకు కారణమన్నారు. వెంటనే కూలీలకు తాగడానికి నీరు , మెడికల్ కిట్లు, వాహన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వారం వారం డబ్బులు చెల్లించాలన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు ఉపాధి హామీపై స్పందించాలని అన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జైవంత్‌రావు, నాయకులు మొబీన్, భీమన్న, మోయిన్, జగన్, జైపాల్, లాజర్, నగేశ్ ఉన్నారు.

భైంసా చిన్నారుల నృత్య ప్రదర్శన



గాన కచేరి చేస్తున్న భైంసా చిన్నారులు

భైంసాటౌన్: శ్రీవాగ్దేవి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నిర్వహించిన నృత్యనీరాజనం కార్యక్రమంలో భైంసాకు చెందిన శార్వాని సంగీత నృత్యానికేతన్ చిన్నారులు నాట్య, గాన ప్రదర్శన నిర్వహించారు. గాన నాట్యాచార్య త్యాగరాజ గానసభను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భైంసా చిన్నారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి శివరాం ప్రసాద్

ఎదులాపురం: కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండి, అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఎస్సీ, ఎస్టీ స్పెషల్ జడ్జి శివరాంప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవనంలో నిర్వహించిన కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల చట్టాలు, హక్కులు తెలుసుకోవాలని చెప్పారు. ప్రతీ కార్మికుడు ఈ శ్రామ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వినోద్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగన్న, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ ఉన్నారు.

'ఐబీ'లో హరితహోటల్

- పర్యాటకానికి దన్నుగా..
- జిల్లాకేంద్రంలో నిర్మాణం
- భూమిపూజ చేయనున్న మంత్రి



నిర్మల్‌లోని ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనం

నిర్మల్: జిల్లా కేంద్రంలో మరో కొత్త నిర్మాణం చోటు చేసుకోనుంది. పర్యాటక అభివృద్ధి దిశగా హరితహోటల్ నిర్మాణం కానుంది. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం(ఐబీ)లో ఈ హోటల్‌ను నిర్మించనున్నారు. ఇదివరకే ఈ స్థలాన్ని టూరిజం కార్పొరేషన్‌కు అప్పగించారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన కార్పొరేషన్ అధికారులు శనివారం ఇక్కడ ఉన్న పాత కట్టడాలను తొలగించే పనులను పర్యవేక్షించారు.

రూ.10కోట్లతో హోటల్..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రస్తుత కలెక్టరేట్ పక్కనే గల ఐబీలో హరితహోటల్‌ను నిర్మిస్తున్నారు. రూ.10కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు మెగా కంపెనీ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు రెండతస్తులుగా భవన నిర్మాణం ఉంటుందని, ఇందులో రెస్టారెంట్‌తో పాటు బార్‌కు అనువుగా నిర్మాణం ఉంటుందని, అలాగే 20గదులు ఉంటాయని అధికారులు వివరించారు. పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి చేసే దిశలో హరిత హోటల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం భూమిపూజ ఉంటుందని పేర్కొన్నారు.



గదులను కూల్చుతున్న దృశ్యం

నిజాం కాలం నాటి కట్టడాలు..

చుట్టూ వేపచెట్లు, నిండుగా పచ్చని వాతావరణంతో ఎప్పుడూ చల్లగా ఉండే ఐబీ చాలా మందికి తెలుసు. నిర్మల్‌కు వచ్చే ప్రజాప్రతినిధులు, బడా నేతలు, అధికారులందరికీ అతిథ్యం ఇచ్చే ఈ రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం ఎప్పుడో నిజాం కాలం నాటి నిర్మాణం. పూర్తిగా డంగుసున్నంతో లావుగా ఉండే గోడలతో కట్టడం వల్ల ఎప్పుడూ చల్లగా ఉంటుంది. చుట్టూ ఉన్న వేప చెట్లు ఇక్కడికి వచ్చే వారందరిని కాసేపు సేద తీరేలా చేస్తాయి. ప్రస్తుతం హరిత హోటల్‌కు ఇవ్వడంతో ఈ చారిత్రక నిర్మాణాలు నేలమట్టం అవుతున్నాయి. అందులోని చెట్లనూ తొలగిస్తుండటంతో చాలామంది విచారం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నయ్యను కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: నేతకాని మహార్ సామాజిక వర్గానికి చెందిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తప్పు చేసినట్లు ఆధారాలతో నిరూపిస్తే తలవంచిపిస్తామని.. కానీ తప్పుడు ఆరోపణలు చేస్తే మాత్రం ఆయనను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలమంతా ఏకమై అండగా నిలుస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నేతకాని మహార్ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్వర్ మాట్లాడుతూ, ప్రస్తుతం తమ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యనే అన్నారు. రాజకీయంగా ఆయనను అణగదొక్కడానికే ఆర్జిజన్ సంస్థకు చెందిన ఆది నారాయణరెడ్డి ఓ మహిళను అడ్డుపెట్టుకొని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యేపై ఆరోపణలను ఖండిస్తూ ఆది నారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, సహచర బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరంగా వెళ్తామన్నారు. అంతకు ముందు అంబేద్కర్, బుద్ధుని చిత్ర పటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు దుర్గం నర్సయ్య, నాయకులు దుర్గం శేఖర్, దీపక్ కుమార్, సుదర్శన్, సంతోష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సర్పే సోంబాయి, తదితరులున్నారు.

మళ్లీ.. బడి రోజుల్లోకి..



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- 25ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- రక్తదానం చేసిన పూర్వ విద్యార్థులు
- సంబురంగా అపూర్వ సమ్మేళనం

నిర్మల్‌ఖిల్లాగేట్: 'అరె.. అతను లికిత్ కదా..! ఎంతలా మారిపోయాడు. స్కూల్లో ఉన్నప్పుడు ఎలా ఉండేవాడు. అస్సలు.. గుర్తుపట్టలేదు తనను..' అని చిన్ననాటి స్నేహితురాలు అంటుంటే.. ' మనం ఇప్పుడా.. అప్పుడా.. ఎప్పుడో 25 ఏళ్ల కింద కలిసి చదువుకున్నం. ఆ తర్వాత మళ్లీ కలుసుకున్నది కూడా లేదు. అమ్మాయిలతో పాటు అబ్బాయిలందరికీ పెళ్లయి, పిల్లలు కూడా అయ్యారు. ఇన్నేళ్ల తర్వాత మారిపోకుండా.. ఇంకా చిన్నప్పటి లాగే ఉంటారా... అంటూ బాల్య మిత్రుడు నవ్వుతూ అన్నాడు. ఇలా సరదా సంభాషణలతో.. చిన్ననాటి జ్ఞాపకాల నెమరు వేసుకుంటూ.. మిత్రులంతా రోజంతా సందడిగా గ డిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి జ్ఞాన మందిర్ ఉన్నత పాఠశాలలో1998–99 లో పదో తరగతి కి చెందిన విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలోని మయూరి ఇన్ హోటల్‌లో కలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అంబరాని మల్లేష్ మధుల్కర్, ప్రణీత, హనుమాన్లు, రాజేందర్, సురేశ్‌లను సన్మానించుకున్నారు. అనంతరం రక్తదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గిరి విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా గిరిజన క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జిల్లాలోని జాతర్ల గిరిజన క్రీడ పాఠశాలకు చెందిన శ్రీకాంత్ జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్, షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. అదే విధంగా ఉట్నూర్ గిరిజన పాఠశాలకు చెందిన కె.పరుశురాం 800 మీటర్ల పరుగులో, పి.సతీష్ కుమార్ డిస్కస్ త్రోలో, జగ్జీవన్ హైజంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. అంతేకాకుండా లాంగ్‌జంప్ ఈవెంట్లో జంగుబాయి, 100 మీటర్ల పరుగులో వైష్ణవి బంగారు పతకాలు సాధించారు. ఖోఖోలో గిరిజన పాఠశాలకు చెందిన నరేష్, ఎం.ప్రశాంతలు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుగా ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి వారికి స్వాగతం పలికి సన్మానించారు. ఐటీడీఏ పీఓ కె.వరుణ్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌లు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు సునంద, శివ, లక్ష్మినారాయణ, రవీందర్ ఉన్నారు.

మళ్లీ టిక్కెట్ నాకే.. గెలిచేది నేనే

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

నేరడిగొండ: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ వచ్చేది తనకేనని, ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించేది నేనేనని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు హాజరైన 25మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పార్టీకే చెందిన ఓ నాయకుడు తనకే టిక్కెట్ వస్తుందంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని, అసత్యపు ప్రచారం నమ్మొద్దని సూచించారు. పార్టీ కోసం పని చేయకుండా టిక్కెట్ కోసం పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. కల్లబొల్లి మాటలు చెబుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పగటి వేషాధారణలో తిరుగుతున్నారని, అలాంటి వారిని పట్టించుకోవద్దన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్‌రెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ శివారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దావుల భోజన్న, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరబాయి, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించే శక్తి బీజేపీకే ఉంది

- మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లాగేట్: బీజేపీలో తాను చేరినప్పటి నుంచి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి కంటిమీద కునుకు లేకుండా పోయిందని, అందుకే తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు ఫేక్ ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో రామరాజ్యం తెచ్చే వరకూ బీజేపీలోనే ఉంటానని అన్నారు. ఒకవేళ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్‌ఎస్ వీడి బీజేపీలోకి వస్తే ఎమ్మెల్యే సీటు త్యాగం చేస్తానని తెలిపారు. తమకు పార్టీ మారాల్సిన అవసరం లేదని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డినే బీజేపీలోకి ఆహ్వానిస్తామని చెప్పారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కర్ణాటక ఎన్నికలు, ఫలితాల తీరుతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటేనని తేలిపోయిందన్నారు. బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవికి ఆశపడి రాత్రికి రాత్రే పార్టీ మారిన ఘనత ఐకేరెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత అంజుకుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, ప్రధాన కార్యదర్శి నరేశ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్, శ్రీనివాస్, అలివేలు, భాస్కర్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో అన్నదాతల్లో గుబులు



కుంటాలలో మక్కల కుప్పపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

కుంటాల: మండలంలోని అంబకంటి, ఓలా, కుంటాల, అందకూర్, వెంకూర్ తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద ఉన్న మొక్కజొన్న, ధాన్యం తడవకుండా రైతులు వాటిపై టార్పాలిన్లు కప్పారు. పది నిమిషాల పాటు వర్షం కురిసి ఒక్కసారిగా ఆగిపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉక్కపోతతో సతమతమయ్యారు.

నర్సాపూర్(జి)లో అకాల వర్షం...

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) మండల కేంద్రంలో సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం, మొక్కజొన్న పంట తడిసిపోయింది. రైతులు ఇళ్ల నుంచి పరుగులు తీసి ధాన్యంపై కవర్లు కప్పారు.తూకం వేసిన బస్తాలు వర్షానికి తడిసిపోయాయి.

ట్రాన్స్‌ఫార్మర్‌కు దాహం..



భైంసాటౌన్: ఇదేంటి ట్రాన్స్‌ఫార్మర్‌కు దాహం అనుకుంటున్నారా.. అవునండీ దానికీ దాహం వేస్తుంది. ఎర్తింగ్ వద్ద నీటి పదును లేకపోతే ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్‌కు గురై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. విపరీతమైన ఎండల నేపథ్యంలో భైంసాలోని కమల థియేటర్ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ శనివారం మాటిమాటికీ ట్రిప్‌కు గురై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించింది. దీంతో విద్యుత్ సిబ్బంది ఇలా ఎర్తింగ్ హోల్‌లో నీరు పోసి ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కాకుండా చూశారు.

చెరువు భూమి కొలతలు కొలిక్కి వచ్చేనా .?

సోన్: మండలం మాదాపూర్ గ్రామంలో కొత్తచెరువు, పల్లె చెరువు, మొల్లోడి చెరువు, పోచమ్మ చెరువులు ఉన్నాయి. చెరువుల చుట్టు రైతులు శిఖం భూమిని కబ్జా చేస్తున్నారని మాదాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయంలో వారం రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. శనివారం అధికారులు కొత్త చెరువును సర్వే నిర్వహించేందుకు వచ్చారు. కబ్జాకు గురైన భూమికి సంబంధించిన పత్రాలు సరిగ్గా లేవని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అధికారుల తీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఇచ్చోడ ఎఫ్‌ఆర్వో మృతి



పాండురంగ్ (ఫైల్)

ఇచ్చోడ: ఇచ్చోడ ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న జాదవ్ పాండురంగ్ (52) శనివారం మృతి చెందాడు. పాండురంగ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల కిందట నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. శనివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిచార్జ్ చేస్తామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఇంతలోనే బాత్‌రూంకు వెళ్లిన పాండురంగ్ కాలుజారి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఎఫ్‌డీవో బర్నాబా, అటవీశాఖ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అతిగా మద్యం తాగి ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మద్యం అతిగా తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై వివరాల ప్రకారం .... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనిల్ రాణ ఎనిమిది మంది కూలీలను తీసుకొచ్చి ఆదిలాబాద్ పట్టణంలోని కార్పెంటర్‌గా పనులు చేయిస్తున్నాడు. వీరంతా ఫిల్టర్‌బెడ్‌లో అద్దెకు ఉంటున్నారు. వీరిలో ఒకరైన మహేష్ రాణ (45) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బస్టాండ్‌లో చెట్ల కింద మద్యం సేవించి పడి ఉండడాన్ని గమనించిన అనిల్ రాణ ఇంటికి తీసుకువచ్చి పడుకొబెట్టాడు. సాయంత్రం వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య

తాంసి: భార్య పుట్టింటి నుంచి రావడం లేదని మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి మత్తడివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన గొడుగుల కళ్యాణ్ (24) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసై పనులు చేయడం మానేశాడు. భర్త మద్యానికి బానిసకావడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన కళ్యాణ్ శుక్రవారం రాత్రి మద్యం మత్తులో మత్తడివాగు ప్రాజెక్టులో దుకాడు. శనివారం ఉదయం ప్రాజెక్టులో మృతదేహన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని మృతదేహన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

20 గొర్రెలు మృత్యువాత..

కుభీర్: మండలంలోని జామ్‌గాం గ్రామంలో శనివారం మధ్యాహ్నం సర్ఫ్, యూరియా కలిపిన నీటిని తాగి 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి సమీపంలో శ్యాల యోగేష్‌కు చెందిన చేనులో బోరుబావి ఉంది. మోటార్‌ను బయటకు తీసేందుకు సర్ఫ్, యూరియా కలిపిన నీటిని బోరుబావిలో పోసి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం సమయంలో ఆనంద్ తన గొర్రెలను తీసుకుని ఆ మోటార్ వద్దకు వచ్చాడు. మోటార్ ఆన్‌చేయగా ఆ నీటిని గొర్రెలు తాగాయి. ఆ నీటిని తాగిన గొర్రెలు కిందపడిపోయాయి. దీంతో ఆనంద్ సమాచారంతో పశు వైద్యుడు సర్వోత్తమ్‌కు ఫోన్ చేశాడు. డాక్టరు వచ్చేలోగా 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 10 గొర్రెలకు చికిత్స చేయగా బతికి బయట పడ్డాయి. గొర్రెల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఆనంద్ తహసీల్దార్‌తో కోరాడు. సర్పంచ్ ముజాయిత్ ఖాన్, ఉపసర్పంచ్ గణేశ్, నాయకులు సంజు ఉన్నారు.

క్లుప్తంగా

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేసి సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర కేబినెట్ నిర్ణయంపై వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, వీఆర్ఏలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు వీఆర్ఏలు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని తెలిపారు. అంకం రాజేందర్, పుప్పాల శంకర్, మహేందర్, స్వప్న, చరణ్, రాజన్న, సంతోశ్, నాగయ్య, బాస్కరాచారి, శేఖర్, వెంకటేశ్, రజిత, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి ఉన్నారు.

తానూరు: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్ఏలు శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరమణను సన్మానించి స్వీట్లు తినిపించారు. ఆర్ఐ గంగాధర్, వీఆర్ఏల మండల అధ్యక్షుడు పీర్హైమద్, వీఆర్ఏలు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



చంద్రశేఖర్

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద నూతన ఎంపీడీవోగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మోహన్ బదిలీపై దిలావాపూర్‌కు వెళ్లారు. కుభీర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న చంద్రశేఖర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాకాల సేవలు అమోఘం



అంబలిపోస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ చేస్తున్న సేవలు అమోఘమని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో అంబలి పంపిణీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాంచందర్ తన తండ్రి పాకాల ముత్తన్న జ్ఞాపకార్థంగా గత ఆరేళ్లుగా నిర్విరామంగా వేసవిలో ప్రజల కోసం అంబలి పంపిణీ, చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డీఎస్పీగా జీవన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది కావడంతో ఆయన్ను సన్మానించారు. పట్టణ సీఐ మల్లేశ్, రవి, ఆదిత్య, చరణ్, హర్ష, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ మైనార్టీ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆమ్‌ఆద్మీ పార్టీ నిర్మల్ నియోజకవర్గ మైనార్టీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సోఫీ మొహమ్మద్ ఇలియాజ్, పట్టణ కోఆర్డినేటర్‌గా ఫైసల్ బిగ్, జనరల్ సెక్రెటరీలుగా సోఫీ మొహమ్మద్, ఇమ్రాన్, కోఆర్డినేటర్లుగా సోఫీ మహమ్మద్, వహీద్ షేక్ జైరుద్దీన్, ఆర్గనైజషన్ సెక్రటరీగా మహమ్మద్ హజార్ ఎన్నికయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన వెన్ను లక్ష్మికి మంజూరైన రూ.24 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి శనివారం అందించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిన్నోల్ల భోజారెడ్డి, మత్స్యశాఖ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాహెందర్, బీఆర్ఎస్ నాయకులు సామల శ్రీనివాస్‌రెడ్డి, మోడికల్ రవి, దేవాగౌడ్, మంగళీ దశరథ్, కర్మె భూమన్న, గూండ్ల గంగాధర్ తదితరులు ఉన్నారు.



స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొడుతున్న యువకులు

స్విమ్ జర స్విమ్

- ఎండవేడి ఉపశమనం కోసం..
- స్విమ్మింగ్‌పూల్‌లో చిన్నాపెద్దలు ఈతకొడుతూ..
- ఈత నేర్చుకునేందుకు పలువురి ఆసక్తి
- అందుబాటులో ట్రైనర్స్



నిర్మల్‌ఖిల్లా: భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నా,పెద్దలు స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ సరదా తీర్చుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో ఈతకొలనులు సోఫీనగర్, మంజులాపూర్ తదితర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి. అక్కడ గడిపిన సమయాన్ని బట్టి ఫీజు ఉంటుంది. పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా కొలనులు ఏర్పాటుచేసి ప్రత్యేక చార్జీ వసూలు చేస్తున్నారు. పిల్లలు, యువత స్విమ్మింగ్ నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వీరికోసం ట్రైనర్స్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

ఆరోగ్య ప్రయోజనాలు..

స్విమ్మింగ్ అనేది కార్డియో వ్యాయామం. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గంట పాటు ఈత కొడితే.. అది ఒక గంట పరిగెత్తడం అవుతుంది. శరీరంలోని అన్ని కండరాలకు బలాన్ని చేకూరుస్తుంది. వేసవిలో వ్యాయామం చేయడానికి ఈత మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- స్విమ్మింగ్ అనేది పూర్తి శరీర వ్యాయామం. ఈత కొట్టేటప్పుడు పాదాలు నిరంతరం కదులుతాయి. ఇది చేతులు, భుజాలకు కూడా బలాన్ని చేకూర్చి.. కండరాలను సమతుల్యత చేస్తుంది.
- ఈత కొట్టడంతో గుండె, శ్వాసకోశ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. రక్తపోటు తగ్గుతుందని, మధుమేహం అదుపులో ఉంటుంది.
- ఈత వల్ల ఊపిరితిత్తుల్లోని ఆక్సిజన్ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఎక్కువ సమయంపాటు శ్వాస బిగపట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. ఆస్తమా ఉన్నవారు ఈత కొట్టడం ప్రయోజనం.
- ఈత కొట్టడంతో శరీరం రిలాక్స్ అవుతుంది. మంచి నిద్ర పట్టడంతోపాటు ఒత్తిడి దూరమవుతుంది.

రోజూ వస్తున్నా



నేను ఉదయం సాయంత్రం స్విమ్మింగ్ నేర్చుకోవడానికి ఇక్కడికి వస్తున్నా. ఎండాకాలం సెలవుల్లో సమయం దొరికింది. ఇప్పుడు స్విమ్మింగ్ చేయగలుగుతున్నా. ఎండ వేడిమినుంచి ఉపశమనం కోసం ఈత కొడుతున్నా. – టి.మనోజ్, సోఫీనగర్

స్విమ్మింగ్‌లో శిక్షణ



నిర్మల్, సోఫీనగర్‌లో స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశాం. పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా ఈతకొలనులు ఉన్నాయి. గంటల లెక్కన చార్జీ చేస్తున్నాం. స్విమ్ సూట్, కళ్లకు ప్రొటెక్షన్ గాగుల్స్ ఉన్నాయి. ఈత నేర్చుకునేవారికి ట్రైనర్స్ అందుబాటులో ఉంచాం. – అర్షద్ అలీ, స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు, నిర్మల్

ఆరోగ్యానికి స్విమ్మింగ్ మంచిది



స్విమ్మింగ్‌తో ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడిని దూరం చేస్తుంది. ఊపిరితిత్తులు, శ్వాస, ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఈతకొట్టడంతో ఉపయోగం. స్విమ్మింగ్ చేయడంతో ఊబకాయులు బరువును తగ్గుతారు. – డాక్టర్.ఏ.రత్నాకర్‌రెడ్డి, ఎండీ, జనరల్ ఫిజీషియన్, నిర్మల్

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి

సారంగపూర్: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించగానే సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ ఏడాది చెరువుల్లో చేపపిల్లలు వదిలామని అధికారులు అనగానే జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కల్పించుకుని ఎక్కడ చేప పిల్లలు వదిలారని ప్రశ్నించారు. అందుకు ఆయన బదులిస్తూ అన్ని చెరువులకు చేపపిల్లలు పంపిణీ చేశామనడంతో అలా జరగలేదని సొసైటీ సభ్యులకు చేపపిల్లలకు బదులుగా డబ్బులు ఇచ్చి మేనేజ్ చేశారని అన్నారు. పూర్తి వివరాలను తమకు చూపించాలని ఎంపీపీ సైతం మత్స్యశాఖ అధికారికి సూచించారు. రెండురోజుల్లో వివరాలను పంపుతామని బదులిచ్చారు. ఐకేపీ తరఫున ఏపీఎం మాట్లాడుతుండగా సభ్యులు అభయహస్తం డబ్బులు ఇంకా అందలేదని ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. డబ్బులు వచ్చాక పంపిణీ చేస్తామనడంతో సారంగాపూర్ ఎంపీటీసీ సామల పద్మ ఆగ్రహించారు. రుణాలు సక్రమంగా అందించడం లేదన్నారు. పంచాయతీరాజ్ ఏఈ శరత్ మాట్లాడుతుండగా కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్ కల్పించుకుని తమ గ్రామానికి వంతెన ఎప్పుడు నిర్మిస్తారని ప్రశ్నించారు. ఏఈ బదులిస్తూ ఒకసారి టెండరు ప్రక్రియ పూర్తి చేశామని రేపోమాపో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సగ్గం రాజు మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాలహాల నిరోధానికి, అనాథ బాలబాలికల పరిరక్షణలో సభ్యులు సహకరించాలని, ఇలా ఎవరూ కనిపించినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపీడీవో సరోజ, ఏఎంసీ చైర్మన్ ఆశ్రితారెడ్డి, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు చందు, ఆలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మాణిక్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పతానిక రాధ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ విగ్రహప్రతిష్ఠాపన



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న పండితులు

ముధోల్: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆదివారం అగ్నిస్థాపన దేవతాపూజ, నవగ్రహ ఆవాహన, నవగ్రహ హోమం, ప్రాణప్రతిష్ఠ పూర్ణాహుతి పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్తం

గ్రామసభ

ముధోల్: మండల కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా 15 గ్రామాల్లో ముధోల్‌ని ఎన్నుకున్నారు, పెరటి తోటలు, కిచెన్‌గార్డెన్, మురుగునీటి వ్యవస్థ తదితర విషయాలపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా డా. సాయి సువరన్, ఎంపీడీవో సురేష్‌బాబుతోపాటు గుంజాల నారాయణ, పెదకారోల్ల మోహన్‌ను సన్మానించారు.

రైతులకు అవగాహన

ముధోల్: మండల కేంద్రంలోని వెంకటాపూర్‌లో రైతులకు పాడి పశువుల పెంపకంపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. పాడి పశువుల పెంపకం, కృత్రిమ గర్భధారణ, తీసుకునే పద్ధతులను మండల కోఆర్డినేటర్ రాథోడ్ గణపతి, వెటర్నరీ వైద్యులు వివరించారు. గోపాలమిత్ర సవిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

సారంగపూర్: జామ్, ధని, చించోలి(బి) గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఏపీడీ ఓస ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఎఫ్ఏ నాగయ్య, కూలీలు ఉన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఖానాపూర్: సుర్జాపూర్‌లో ఉపాధి కూలీలకు బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ మండుటెండల్లో ఉపాధి పనులుచేస్తున్న కూలీలకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పనిచేసే ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కిట్లు అందించాలన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

సోన్: న్యూవెల్మల్ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వీడీసీ సభ్యులు కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్‌ను శనివారం కలిశారు. ఎంపీటీసీ నాగయ్య, ఉప సర్పంచ్ స్వామి, వీడీసీ చైర్మన్ సాగర్,రైటర్ రవి,అంకం శ్రీనివాస్,వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ కొనుగోలుకు దాతల సహకారం

కుంటాల: ఓలా గ్రామంలో ఇటీవల నూతన ఆలయాలు నిర్మింపజేశారు. హనుమాన్ విగ్రహం కొనుగోలు కోసం లోలం గజేందర్, పరుశరాముని కోసం చాకలి లస్మన్న, పెద్దమ్మకు బేస్తా కృష్ణ, ముత్యం, బ్రాహ్మణ ఎల్లమ్మకు ఎంపీటీసీ కట్ట రవి, రేణుక ఎల్లమ్మ విగ్రహం ఏర్పాటుకు ఓలా గౌడ సంఘ సభ్యులు దాతలుగా ముందుకొచ్చారు. శనివారం గ్రామస్తులు దాతలను అభినందించి సన్మానించారు.

శ్రమదానం

కుంటాల: అందకూర్ అంగన్‌వాడీ పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. శనివారం వాటిని తొలగించేందుకు గ్రామస్తులు శ్రమదానం చేసేందుకు కలిసికట్టుగా కదిలారు. పిచ్చి మొక్కలు తొలగించారు. సర్పంచ్ దాసరి కిషన్, కార్యదర్శి రమ్య, టీచర్లు విమల, సుజాత ఉన్నారు.

పాడి రైతులకు రుణాలు

లోకేశ్వరం: పాడి పశువులను కొనుగోలు చేసేందుకు పాడి గేదెలు, ఆవుల కోసం రుణాలు అందజేస్తామని ఐకేపీ సీసీ మహేందర్ అన్నారు. పోట్‌పల్లి, బామ్నికే గ్రామాల్లో పాడి రైతులకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విజయ డైయిరీ సూపర్‌వైజర్ రమేశ్, ముత్తన్న, లక్ష్మణ్‌పటేల్, గోయిండ్‌రావు, నారాయణ్ ఉన్నారు.

పాడితో అదనపు ఆదాయం

కడెం: పాడితో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని విజయ డైరీ మెనేజర్ వెంకటస్వామి అన్నారు. కల్లెడలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అంజన్న, సిబ్బంది పున్నం నాయక్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలోని వీధులు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్‌లను డీపీ ఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లోని రోడ్లపై చెత్తాచెదారం తొలగించాలన్నారు.

విశ్వకర్మభగవాన్ శిలా విగ్రహ మహోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని భవానీనగర్‌లో మూడు రోజులపాటు నిర్వహించే శ్రీమద్విరాట్ విశ్వకర్మభగవాన్ శిలా విగ్రహ మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ఉదయం అగ్నిప్రతిష్ఠ, విరాడ్విశ్వకర్మ మూల మంత్ర హోమం, యంత్ర, మంత్ర పుష్పం తదితర పూజలు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం నుంచి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బాదన్‌కూర్తిలో..

ఖానాపూర్: బాదన్‌కూర్తి గ్రామంలోని శ్రీబెల్లాల పోచమ్మ శిలావిగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శ్రావణ్, ఉప సర్పంచ్ నవీన్, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా సుందరయ్య వర్ధంతి

ఖానాపూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలోని తలారిగంగన్న నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, నాయకుడు బోసు భూమన్న తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో గుడ్లు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు పంపిణీ చేశారు. బాబాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సర్పంచ్ శ్రీవిద్య శనివారం గుడ్లు అందజేశారు. రాగితో చేసిన లడ్డూలను చిన్నారులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్, ఏవో స్రవంతి



లోకేశ్వరం: అబ్దుల్లాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో గణేశ్

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

జిల్లావ్యాప్తంగా ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాల ప్యాకెట్లు, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదుతోపాటు షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. సీఐలు శ్రీను, చంద్రశేఖర్, శ్రీనివాస్, నారాయణనాయక్, వినోద్‌రెడ్డి, ఎస్సైలు రాజు, శ్రీకాంత్, సాయికుమార్, రాహుల్ గైక్వాడ్, సాయికిరణ్, ఏడీఏ వీణ, ఏవోలు రాంచందర్‌నాయక్, సంధ్యారాణి, ప్రవీణ్ కుమార్, రవి, రాజశేఖర్‌రెడ్డి, రజనీకాంత్, ఏఈవోలు ఉన్నారు. – సాక్షి నెట్‌వర్క్

బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి



భూమి పూజలో పాల్గొన్న ఎంపీపీ పద్మ, నాయకులు

లక్ష్మణచాంద: బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో రూ.3 లక్షలతో చేపట్టే గ్రావెల్ రోడ్డు పనులకు శనివారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చామన్‌పెల్లిలో రూ.60 లక్షలతో రామాలయం, రూ.10 లక్షలతో భీమన్న ఆలయం నిర్మించామన్నారు. రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీలు గణేశ్, అనిత, ఉప సర్పంచ్ రమణ, నాయకులు రాజేందర్, సురేష్, మధు, సుదర్శన్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిబాపూలే నాటకం



నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం రాత్రి సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే జీవిత చరిత్రను తెలిపేలా నిర్వహించిన 'సత్యశోధన' నాటకం అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శన వీక్షించేందుకు దళిత, బహుజన సంఘ నాయకులు, విద్యావంతులు హాజరయ్యారు. మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ కృష్ణంరాజు, బీఎస్పీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌బీ ఎరువులతో అధిక దిగుబడులు



రాచాపూర్‌లో వరి దిగుబడిని పరిశీలిస్తున్న ఏఈవోలు

లక్ష్మణచాంద: వరి పంటల్లో పీఎస్‌బీ ఎరువుల వాడకంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కనకాపూర్ క్లస్టర్ ఏఈవో సంతోష్ అన్నారు. మండలంలోని కనకాపూర్ క్లస్టర్ పరిధిలోని రాచాపూర్, వడ్యాల్ గ్రామాల్లో పీఎస్‌బీ (పాస్ఫరస్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా) ఎరువుతో సాగైన వరి పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ రాచాపూర్ గ్రామ రైతు గడ్డం శంకర్.. పీఎస్‌బీ ఎరువుతో వరిలో మంచి దిగుబడులు సాధించారని తెలిపారు. యూరియా, డీఏపీ బదులు పీఎస్‌బీ వాడకం వల్ల సాగు ఖర్చులు రైతుకు తగ్గాయన్నారు. ఏఈవోలు ఉమామహేశ్వరి, పవిత్ర, రైతులు తదితరులు ఉన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో నాగరాజు

మామడ: రైతులు వెదజల్లె పద్ధతిన వరి పంట వేయడంతో సాగుకయ్యే వ్యయ్యాన్ని తగ్గించుకోవచ్చని ఏవో నాగరాజు అన్నారు. మండలంలోని పరిమండల్ గ్రామంలో వెదజల్లె పద్ధతిన వరి పంట క్షేత్రప్రదర్శనపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో విత్తన మోతాదు సగానికి తగ్గించవచ్చని అన్నారు. పంటకాలం 20 నుంచి 25 రోజులకు తగ్గుతుందన్నారు. నాటు వేసేందుకు కూలీల ఖర్చు 4 నుంచి 5 వేల వరకు ఆదా చేయవచ్చని సూచించారు. దీంతో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవచ్చని అన్నారు. ఏఈవో శివకుమార్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు లింగన్న, రైతులు ఉన్నారు.



రోడ్డుపై బైఠాయించిన వీవోఏలు

వీవోఏల ఆందోళన

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఖానాపూర్‌లో వీవోఏలు శనివారం ఆందోళన నిర్వహించారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన వీవోఏలు పట్టణంలోని దీక్షా శిబిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక తెలంగాణచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేపట్టి తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వీవోఏలను ఎస్సై అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీస్ జులుం నశించాలంటూ వీవోఏలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీవోఏల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పాల్గొన్నారు.

భైంసారూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపడుతున్న వీవోఏల సమ్మె శనివారంతో 32వ రోజుకు చేరింది.

'పది' టాపర్‌కు సన్మానం

ఖానాపూర్: ఇటీవల పది ఫలితాల్లో మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శ్రీపాద సుదీక్ష 10 జీపీఏ సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ నివాసంలో విద్యార్థిని శనివారం సన్మానించారు.

సుదీక్షను సన్మానిస్తున్న ఎమ్మెల్యే